ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

చిత్తూరు

జిల్లా వార్తలు

మంగళవారం 14 మే 2024





చిత్తూరులోని కన్నన్ కళాశాలలో బారులు తీరిన ఓటర్లు

పోలింగ్ ప్రశాంతం

● జిల్లాలో 11 గంటలకు 81.19 శాతం నమోదు ● కుప్పంలో 11.30 గంటలకు ముగిసిన ఓటింగ్ ● వి.కోటలో అర్ధరాత్రి వరకు కొనసాగిన పోలింగ్

ఒకవైపు వైసీపీ నేతల ఆగడాలు. మరోవైపు అక్కడక్కడ దాడులు. ఇలా చిత్తూరు, పుంగనూరు, కుప్పం, పూతలపట్టు నియోజకవర్గాల్లో అధికార పార్టీ గొడవలకు దిగింది. ఈ ఘటనలు మినహా జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



ఓబనపల్లెబూత్ వద్ద పోలీసులు లాఠీచార్జీ

పోలింగ్ శాతం 82.65

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో పోలింగ్‌కు సంబంధించి సోమవారం రాత్రి చివరగా అందిన సమాచారం మేరకు 81.19 శాతం నమోదైంది. తొలి రెండు గంటల్లో 10శాతంలోపు పోలైంది. ఉదయం 11గంటలకు 25.81, మధ్యాహ్నం ఒంటి గంటకు 43.47, 3 గంటలకు 61.94, సాయంత్రం 4 గంటల ప్రాంతానికి 65.82శాతం, 5 గంటల ప్రాంతానికి 74.09శాతం పోలైంది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సమయం ముగిసినా.. క్యూలైన్‌లో ఉన్న వారికి ఓటింగ్‌కు అనుమతించారు.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతాలిలా..

పుంగనూరు	80.25
నగరి	81.15
గంగాధర నెల్లూరు	82
చిత్తూరు	80.65
పూతలపట్టు	85.35
పలమనేరు	82.99
కుప్పం	85.87

వి.కోటలో అర్ధరాత్రి కొనసాగిన పోలింగ్



వి.కోట మండలం జవ్వునిపల్లె కేంద్రంలో రాత్రి 10 గంటలకు క్యూ కట్టిన ఓటర్లు

వి.కోట: వి.కోట మండలం జవునిపల్లె, ఎస్.బండపల్లె పోలింగ్ కేంద్రాల్లో సోమవారం అర్ధరాత్రి 12 గంటలైనా పోలింగ్ కొనసాగింది. పలుచోట్ల సాంకేతిక లోపంతో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. తోటకనుమ, కుమ్మరమడుగు, కుంబార్లపల్లె, లింగాపురం, నెర్నపల్లె పోలింగ్ కేంద్రాలలో రాత్రి పది గంటలైనా పోలింగ్ కొనసాగింది. పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలోని రెండు కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యమైంది. బాలికోన్నత పాఠశాలలో రెండు, నెర్నపల్లె, పాముగానిపల్లె, కుంబార్లపల్లె, జవ్వునిపల్లె పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు, వీవీప్యాట్ పనిచేయకపోవడంతో రెండు గంటలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. పలుచోట్ల ఉదయాన్నే 6 గంటలకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నా పోలీసులు 7 గంటల వరకు అనుమతించకపోవడంతో వాగ్వాదానికి దిగారు. చింతమాకులపల్లె కేంద్రంలో వృద్ధురాలికి సహాయకురాలిగా వెళ్లిన మహిళ సైకిల్‌కు బదులుగా ఫ్యాన్‌కు ఓటేయడంతో వృద్ధురాలు ఆగ్రహంతో గొడవకు దిగింది. పాముగానిపల్లెలో వలంటీర్లు ఏజంట్లుగా కూర్చోవడంపై టీడీపీ వారు అభ్యంతరం తెలపడంతో కాసేపు ఘర్షణ జరిగి పోలింగ్ ఆలస్యమైంది. జవ్వునిపల్లె కేంద్రంలో టీడీపీ, వైసీపీ వర్గీయులు పరస్పరం గొడవకు దిగడంతో సాయుధ బలగాలు ఇరువర్గీయులను చెదరగొట్టాయి.

కుప్పంలో 11.30 గంటల వరకు..

కుప్పం: కుప్పం మునిసిపాలిటీ తంబిగానిపల్లె, గుడుపల్లె మండలం శెట్టిపల్లెలో రాత్రి 11.30 గంటల వరకు పోలింగ్ జరిగింది. కుప్పం మండలం మంకలదొడ్డి, శీగలపల్లెల్లోనూ రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది.



తంబిగానిపల్లెలో..

లండన్ నుంచి వచ్చి ఓటేశాడు

శ్రీరంగరాజపురం: ఎస్ఆర్‌పురానికి చెందిన ఆ యువకుడు వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. లండన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. తన ఓటు వృథా కాకూడదని భావించాడు. వ్యయ ప్రయాసలకోర్చి సోమవారం సొంత గ్రామానికి చేరుకుని తన ఓటు హక్కును వినియోగించుకుని, స్థానికంగానే ఉంటూ ఓటు వేయని వారికి ఆదర్శంగా నిలిచాడు.



సీకే బాబు వర్సెస్ విజయానందరెడ్డి



చిత్తూరు నగరం మిట్టూరు పోలింగ్ కేంద్రంలో వైసీపీ తరఫున వలంటీర్లు ఏజెంట్లుగా కూర్చున్నారనే సమాచారం వచ్చింది. దీంతో జనరల్ ఏజెంట్ అయిన టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు అక్కడికి వెళ్లారు. ఆ వెంటనే వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి కూడా అక్కడికి వచ్చారు. 'వాడేమన్నా పులా.. వాడికి షాడో పెట్టండి' అని ఆయన పోలీసులకు చెప్పారు. వెంటనే జేసీ శ్రీనివాసులు, సీఐ విశ్వనాథ్‌రెడ్డి కేంద్రం లోపలికి వెళ్లి సీకే బాబును వెళ్లిపోవాలని కోరారు. అధికారులు సీకేతో మాట్లాడుతుండగానే, విజయానందరెడ్డి కల్పించుకుని.. ఈయన ఇక్కడికి వచ్చి దౌర్జన్యం చేస్తున్నాడని గట్టిగా కేకలు పెట్టారు. ఏజెంట్ స్లిప్‌ను రద్దు చేస్తున్నామని జేసీ శ్రీనివాసులు చెప్పగా.. పోలీసులు సీకేను అక్కడ్నుంచి పంపించేశారు.

మిట్టూరులో ఉద్రిక్తత

అనంతరం మిట్టూరు కేంద్రానికి టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ వెళ్లి.. వలంటీర్లను ఏజెంట్లుగా ఎలా కూర్చోబెడుతారని, వాళ్లను పంపేయాలని పోలీసులను కోరారు. ఆ వలంటీర్లంతా రాజీనామా చేసినవారేనని పోలీసులు వివరించారు. ఆమోదం పొందిన లెటర్లను చూపసించాలని గురజాల, బీజేపీ నేత చిట్టిబాబు డిమాండు చేశారు. కేంద్రానికి ఓ వైపు గురజాల, మరోవైపు విజయానందరెడ్డి.. వారి వర్గీయులు చాలాసేపు ఉండగా, కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు సర్దుబాటు చేయడంతో గురజాల.. తర్వాత విజయానందరెడ్డి వెళ్లిపోయారు.



గురజాల అనుచరులను కొడుతున్న వైసీపీ కార్యకర్తలు

గురజాల వాహనాన్ని వెంటాడిన చుడా చైర్మన్

పోలింగ్ కేంద్రాల పరిశీలనకు వెళ్లిన చిత్తూరులో టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను షర్మన్ స్కూల్, మంగసముద్రం వద్ద వైసీపీ నేత, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి తన వాహనాన్ని అడ్డుపెట్టి ఇబ్బంది కలిగించారు. మంగసముద్రం నుంచి కారులో బయల్దేరిన గురజాల వాహనానికి పురుషోత్తంరెడ్డి మళ్లీ తన వాహనాన్ని అడ్డుపెట్టారు. ఎంతసేపైనా తీయలేదు. ప్రశ్నించినందుకు టీడీపీ శ్రేణుల మీద వైసీపీ వాళ్లు దాడి చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పురుషోత్తంరెడ్డిని వాహనంలో కూర్చోబెట్టి అక్కడి నుంచి పంపించేశారు. జనం ఎక్కువగా ఉండడంతో ఎస్‌టీఎఫ్ పోలీసులు అక్కడికి చేరుకుని లాఠీచార్జీ చేసి చెదరగొట్టారు.

సదుంలో టీడీపీ ఏజెంట్ల కిడ్నాప్

● నలుగురిపై దాడి.. పీలేరులో విడుదల

పుంగనూరు: సదుం మండలం బూరగమందలో పోలింగ్ ఏజెంట్లుగా ఉండరాదంటూ టీడీపీ శ్రేణులపై వైసీపీ నేతలు ఆగ్రహించారు. సోమవారం తెల్లవారుజామున 14మందిని కిడ్నాప్ చేశారు. బాధితుల కథనం మేరకు.. బూరగమందలో 188, 189, 199 పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ ఏజెంట్లుగా కూర్చోవడానికి పంచాయతీకి చెందిన నాయకులు చీకలచేను, పంచార్లమాకులపల్లె నుంచి ద్విచక్రవాహనాల్లో బయలుదేరారు. తెల్లవారుజామున 4.15గంటలకు వస్తుండగా వైసీపీ శ్రేణులు బూరగమంద టవర్ వద్ద వీరిని అడ్డుకుని బలవంతంగా వాహనాల్లో ఎక్కించి కిడ్నాప్ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి ఇలాకాలోనే ఏజెంట్లుగా కూర్చొంటే మీ తలకాయలు తెగిపడతాయని దౌర్జన్యం చేశారు. గతంలో బూరగమందకు చెందిన రాజారెడ్డిని కిడ్నాప్ చేసి తీవ్రంగా కొట్టి, కాళ్లు విరిచి కల్లూరు అడవిలో పడేసిన విషయం తెలిసిందే. కిడ్నాప్‌కు గురైన రాజారెడ్డి, సుబ్బరాజు, సురేంద్ర, ముత్తు, గణేశ్, బాలసుబ్రహ్మణ్యం, వెంకటస్వామి, కృష్ణమూర్తి, అశోక్, విజయ్, కిషోర్, ఉదయ్, మరో ఇద్దరిని కెఏ 02, ఎంఎన్1342 ఇన్నోవా ఏపీ39, డబ్ల్యూఈ 777 స్కార్పియో, మరో రెండు వాహనాల్లో గంటావారిపల్లె కల్లూరు మీదుగా పీలేరు, రాయచోటి మార్గంలోని టోల్‌గేట్ సమీపంలోని గెస్ట్‌హౌస్‌కు తీసుకెళ్లారు. రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రాజు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం వెలుగులోకి రావడం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్‌కు మార్‌మీనా తీవ్రంగా స్పందించడంతో కిడ్నాప్ అయిన వారి ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నించారు. కిడ్నాపర్ల దాడిలో ముత్తు, రాజారెడ్డి, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ క్రమంలో ఉదయం 6 గంటలకు పీలేరు పింఛానది బ్రిడ్జి సమీపంలో టీడీపీ శ్రేణులను కిడ్నాపర్లు వదిలి పారిపోయారు. ఈ విషయం తెలుసుకుని టీడీపీ నాయకులు వాహనాలు పంపడంతో వారంతా బూరగమంద చేరుకున్నారు. టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి, డీఎస్పీ మహబూబ్‌బాషా, సీఐ కృష్ణారెడ్డిలకు జరిగిన విషయం తెలిపారు. వీరిలో కొందరు రిలీవర్‌పోలింగ్ ఏజెంట్లుగా వెళ్లారు. కిడ్నాప్ చేసిన వాహనాలు, వ్యక్తుల గురించి సీఐ కృష్ణారెడ్డికి చెప్పినా వైసీపీ వారికే మద్దతుగా ఉంటూ తమను పలుమార్లు ఇబ్బంది పెడుతూ తరిమేశారని టీడీపీ వర్గీయులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేదు.



బూరగమందకు చేరుకున్న కిడ్నాప్‌నకు గురైన టీడీపీ శ్రేణులు

వైసీపీ చర్యలకు విరుగుడుగా..

వైసీపీ చర్యలను పసిగట్టిన.. టీడీపీ నేత రఘునాథరెడ్డి, తన భార్యతో కలిసి ఏజెంట్ ఫారాలతో ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. మహిళ ఉండటంతో అయన్ను వైసీపీ నేతలు అడ్డుకోలేదు. దీంతో రఘునాథరెడ్డి మరికొందరు బూరగమంద పోలింగ్ కేంద్రంలో ఏజెంట్లుగా కూర్చున్నారు.

ఆ పుణ్యాత్ముడే రావాలి



అమ్మణ్ణమ్మ

కుప్పం, మే 13: 'ఆ పుణ్యాత్ముడు చంద్రబాబే అధికారంలోకి రావాలని' శతాధిక వృద్ధురాలు మనసారా దీవించింది. కుప్పం మండలం వసనాడు పోలింగ్ బూత్ వద్దకు 115 ఏళ్ల అమ్మణ్ణమ్మ ఓటేయడానికి బంధువుల సాయంతో చక్రాల కుర్చీపై వచ్చింది. అక్కడున్న వారు ఎవరు అధికారంలోకి వస్తే బాగుంటుందని అడుగగా ఆమె పై విధంగా దీవెనలిచ్చింది. 'సెంద్రబాబు వస్తేనే బాగు. పుణ్యాత్ముడు పేదోళ్లకంతా కాపాడా. అందరికీ ఇల్లు, దుడ్లు సేశా. ఆయప్పే రావాలి.' అని వొణుకుతున్న గొంతుతో దీవెనలు కురిపించింది. సెంద్రబాబే గెలవాలంటూ ఆ పరమాత్ముడికి రెండు చేతులూ జోడించి మొక్కింది.



చీలాపల్లిలో గాయపడ్డ మోహన్‌క్రిష్ణ - మండిక్రిష్ణాపురంలో రవి..

దొంగ ఓట్లను అడ్డుకోవడంతో దాడి

యాదమరి: మండలంలోని 14 కండ్రిగ ముస్లింవాడ పోలింగ్ బూత్‌లో సాయంత్రం కొంత మంది వైసీపీ నేతలు దొంగ ఓట్లను వేస్తుండగా కిటికీలో నుంచి కొంత మంది టీడీపీ కార్యకర్తలు సెల్‌ఫోన్లలో వీడియో తీశారు. దీంతో వారిపై వైసీపీ శ్రేణులు దాడి చేయడంతో తొమ్మిది మంది గాయపడ్డారు. గాయపడిన వారిని టీడీపీ అభ్యర్థి మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ అధికార ప్రతినిధి వల్లేరు అమరనాథనాయుడు నేతలు పరామర్శించారు.



భరత్ ఆగడాలు

రామకుప్పం మండలం సింగసముద్రంలో వైసీపీ అభ్యర్థి భరత్ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి తలుపులు మూసుకున్నారు.గుర్తించిన టీడీపీ నాయకులు వెంటనే తలుపులు తెరిచారు.దీంతో వైసీపీ శ్రేణులు వీరంగం సృష్టించి టీడీపీ వారి మీద దాడి చేశారు. టీడీపీ ఏజెంట్లకు గాయాలయ్యాయి. ననియాల కేంద్రం వద్ద గిరిజనులపై ఎమ్మెల్సీ భరత్, అతని గన్‌మెన్ చేయి చేసుకున్నట్లు టీడీపీ వాళ్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఓటేసిన కలెక్టర్, జేసీ



ఓటేస్తున్న కలెక్టర్ షన్మోహన్ - ఓటేసేందుకు క్యూలో నిలుచున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, మే 13: జిల్లా ఉన్నతాధికారులు సోమవారం తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ మధ్యాహ్నం కలెక్టర్ బంగ్లా పక్కనున్న బాపు బాలభవన్‌లోని 44వ పోలింగ్ స్టేషన్‌లో క్యూలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొంగారెడ్డిపల్లిలోని షర్మన్ బాలికోన్నత పాఠశాలలోని 50వ పోలింగ్ కేంద్రంలో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ శ్రీనివాసులు క్యూలో నిలబడి ఓటేశారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్, మే 13: కలెక్టరేట్‌లోని కొత్త స్పందన హాలులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ పరిశీలించారు. ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి ఉదయం 7 గంటల వరకు మాక్ పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈవీఎంలు మొరాయించిన చోట వెంటనే సరిచేసి పోలింగ్ ప్రక్రియకు ఇబ్బంది లేకుండా చేశారు. వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని నిశితంగా పరిశీలించారు. సాధారణ పరిశీలకులు షాదిక్ అలామ్, కైలాష్ వాంఖ్డే, పోలీసు అబ్జర్వర్ అరవింద సాల్వే, చిత్తూరు పార్లమెంటు సెగ్మెంట్ వ్యయ పరిశీలకుడు శంకర్ ప్రసాద్ శర్మ వారి వెంట ఉన్నారు.

సమస్యాత్మక కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

చిత్తూరు, మే 13: ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో భాగంగా సమస్యాత్మక ప్రాంతాల్లో డీఎస్పీ స్థాయి అధికారులతో పటిష్ఠ భ ద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పరిష్కరించే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 7 గంటలకు ఆయన పూతలపట్టు నియోజకవర్గంలోని అగ్రహారం బూత్‌ను సందర్శించారు. ఓటర్లతోపాటు వృద్ధులు, బాలింతలు, మహిళలు స్వేచ్ఛగా ఓటు వేసేలా పోలీసు శాఖ తరపున చర్యలు తీసుకున్నామన్నారు. ఎస్పీతోపాటు జిల్లా స్పెషలాఫీసర్ ఈశ్వరరావు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

రిజర్వు ఉద్యోగులకు డ్యూటీ ఇవ్వని ఈఆర్వో



పుంగనూరు స్త్రీశక్తి భవన్‌లో వేచి ఉన్న రిజర్వు పోలింగ్ సిబ్బంది

పుంగనూరు రూరల్, మే 13: సౌకర్యాలు కల్పించకుండా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇబ్బంది పెట్టారని పుంగనూరు నియోజకవర్గంలో పోలింగ్ విధులకు వచ్చిన రిజర్వు ఉద్యోగులు ఆరోపించారు. ఆదివారం తెల్లవారుజామున చిత్తూరు, కుప్పం, నగరి, పూతలపట్టు తదితర నియోజకవర్గాల నుంచి రిజర్వు పోలింగ్ విధులకు 150 మంది వచ్చారు. శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో వేచి ఉండగా మధ్యాహ్నం భోజనం పెట్టి, తర్వాత వారి గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఈ విషయమై ఈఆర్వో మధుసూదన్‌రెడ్డితో మాట్లాడగా ఎక్కడైనా బంధువుల ఇళ్లలో ఉండాలని, తాము పిలిచిన 15 నిమిషాల్లో ఇక్కడకు చేరుకోవాలని చెప్పడంతో వారు అవాక్కయ్యారు. దీంతో రాత్రి భోజనం, వసతి లేక మహిళా ఉద్యోగులు అవస్థలు పడ్డారు. కొందరు వెనక్కు వెళ్లిపోయారు. సోమవారం వెళ్లి తమకు డ్యూటీ కేటాయించకపోతే అలెవెన్స్ ఇస్తే వెళ్లిపోతామని అడగ్గా బుధవారం రావాలని చెప్పడంతో ఏమి చేయాలో వారికి పాలుపోలేదు. ఈ విషయమై ఈఆర్వో మధుసూదన్‌రెడ్డిని వివరణ కోరగా ఆదివారం రాత్రే పుంగనూరు నుంచి ఆర్టీసీ బస్సులో నగరికి ఉద్యోగులను పంపామని, మిగిలిన వారికి అలెవెన్స్ బుధవారం ఇస్తామని చెప్పామని అన్నారు.



చౌడేపల్లె మండలం కాగతిలో సోమవారం రాత్రి 9 గంటలకూ ఓటేసేందుకు వేచియున్న ఓటర్లు



విజయపురం మండలం కేవీపురంలో సాయంత్రం 6 గంటలకు బారులు తీరిన ఓటర్లు



కుప్పం మండలం మంకలదొడ్డి 222 బూత్ వద్ద అస్తవ్యస్త క్యూలైన్లతో ఓటర్ల ఇబ్బందులు



పోలింగ్ సమయం పూర్తవడంతో క్యూలో ఉన్నవారికి టోకెన్లు జారీచేస్తున్న అధికారులు - రాత్రి 7 గంటలకు గేట్లు దూకి లోనికి ప్రవేశిస్తున్న వైసీపీ మద్దతుదారులు



కీలపట్ల 99వ బూత్ వద్ద ఓటు వేయడానికి గుమిగూడిన ఓటర్లు

సమయం మించినా..

క్యూలోకి వచ్చిన వైసీపీ నేతలు

అడ్డుకున్న అధికారులపై తిరగబడిన వైనం

కీలపట్ల, గుండుగల్లు, గంగవరం, కొత్తపల్లెల్లో రాత్రి 8, 9 గంటల వరకు ఓటింగ్

గంగవరం, మే 13 : సమయం మించిపోయినా వైసీపీ నేతలు క్యూలోకి ప్రవేశించడమేగాక అడ్డుకున్న అధికారులపై తిరగబ డడం చర్చనీయాంశంగా మారింది. పోలింగ్ సమయం 6 గంటలకు పూర్తయిన వెంటనే గంగవరం, గుండుగల్లు, కొత్తపల్లె, కీలపట్ల బూత్‌లలో క్యూలో ఉన్న వారందరికీ అధికారులు టోకెన్లు పంపిణీ చేసి, గేట్లకు తాళాలు వేశారు. కీలపట్లలో స్లిప్పులు ఇచ్చిన వారు ఓటువేసి, అదే స్లిప్పులను గేటుబయట ఉన్న వారికి అందించారు. వారు తమ వద్ద స్లిప్పులు ఉన్నాయని, మమ్మల్ని ఎందుకు లోనికి అనుమతించరని పోలీసు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. తాళం తీసే ప్రసక్తే లేదని పోలీసులు తెగేసి చెప్పారు. ఇంతలో కొంతమంది వైసీపీ చోటా లీడర్లు స్లిప్పులున్న వారి అనుచరులను గేట్లు, గోడలు దాటించి లోనికి పంపించారు. పోలింగ్ సిబ్బంది గమనించి వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించగా తిరగబడి హంగామా సృష్టించారు. దీంతో అధికారులు సైతం మిన్నకుండిపోయారు. కాగా, ఈవీఎంల పనితీరు మందకొడిగా ఉండడంతో మండలంలోని గుండుగల్లు, గంగవరం, కొత్తపల్లెలలో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. కీలపట్లలో మాత్రం రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. దండపల్లెలో అర్ధ గంట పాటు ఈవీఎం మొరాయించినా టెక్నికల్ సిబ్బంది సరిజేయడంతో పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. గుండుగల్లులో వైసీపీ నాయకులు దొంగ ఓట్లు వేయించడానికి ప్రయత్నిస్తున్నారని టీడీపీ ఆరోపించడంతో వాగ్వాదాలు, తోపులాటలు చోటుచేసుకున్నాయి. పోలీసులు శాంతింపజేశారు. దండపల్లె బూత్ ఎదుట వైసీపీ నాయకులు ఫ్యాన్‌కు ఓటేయాలని బలవంతం చేయగా, టీడీపీ నాయకులు అడ్డుకోగా స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. గంగవరం, మబ్బువాళ్లపేట, మారేడుపల్లె, దండపల్లె లతోపాటు పలు కేంద్రాల్లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా క్యూలు ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కీలపట్లలో పోలింగ్ బూత్‌లను కుదించేయడంతో రాత్రి 9 గంటల వరకు ఓటర్లు బారులు తీరారు. ఓటు వేయడానికి 3 నుంచి 4 గంటలు పట్టడంతో ఓటర్లు తిరగబడ్డారు.

దొంగ ఓట్లను అడ్డుకున్నారని..

టీడీపీ నేతలపై వైసీపీ శ్రేణుల దాడి

పుంగనూరు, మే 13: దొంగ ఓట్లను అడ్డుకున్నారనే కోపంతో పోలింగ్ అనంతరం తెలుగుదేశం పార్టీ నేతలపై వైసీపీ శ్రేణులు దాడులకు తెగబడ్డాయి. ఎంపీడీవో కార్యాలయం, తాటిమాకులపాళ్యం పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ ఏజెంట్లు దొంగ ఓట్లకు అనుమతించకపోవడంతో వైసీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. వైసీపీకి ఓట్లు వేయాలని కౌన్సిలర్ నటరాజ ప్రచారం చేస్తుండటంతో టీడీపీ మాజీ కౌన్సిలర్ దేశాది ప్రకాశ్ అడుకున్నారు. వీరి మధ్య గొడవ జరిగింది. తాటిమాకులపాళ్యం పోలింగ్ కేంద్రంలో ప్రకాశ్ ఓటు వేయడానికి వెళ్లగా వైసీపీ శ్రేణులు దుర్భాషలాడాయి. అదే సమయంలో తన ఓటు అడ్డుకున్నారని వైసీపీకి చెందిన బండ కుమార్ గొడవకు దిగారు. పోలింగ్ అనంతరం వారి వారి ఇళ్లకు వెళ్లారు. ఈ క్రమంలో తాటిమాకులపాళ్యంలో దేశాది ప్రకాశ్ ఇంటిపై వైసీపీ కౌన్సిలర్ నటరాజ, పార్టీ కార్యకర్తలు బండ కుమార్, సాగర్, సునీల్ తదితరులు రాళ్లు, కర్రలతో ఇంటి వద్దకు వచ్చి దుర్భాషలాడుతూ దాడి చేయడానికి ప్రయత్నించారు. దేశాది ప్రకాశ్ ఫిర్యాదు చేయడంతో ఏఎస్పీ సుబ్బరాజు ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని అక్కడ నుంచి పంపించేశారు. అలాగే స్థానిక కొత్తయిండ్లు పోలింగ్ కేంద్రంలో దొంగ ఓట్లు అనుమతించలేదని టీడీపీ ఏజెంట్లు నరేశ్‌రాయల్, రమేశ్‌లను కొట్టాలని అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రం వద్దకు వైసీపీ శ్రేణులు వచ్చాయి. దీంతో పోలింగ్ ముగిసినా వారు పోలీసులకు సమాచారం ఇచ్చి అక్కడే ఉన్నారు. ఈ క్రమంలో నరేశ్‌రాయల్, రమేశ్‌లను ఏఎస్పీ సుబ్బరాజు తన వాహనంలో ఇళ్లకు పంపారు.

బెడిసికొట్టిన వైసీపీ వ్యూహం

బైండోవర్ కేసులు పెట్టినా ఈసీ నిర్ణయంతో ఏజెంట్లుగా ప్రతిపక్ష నేతలు

పుంగనూరు, మే 13: పుంగనూరు నియోజకవర్గంలో పోలీసుల సాయంతో వైసీపీ పన్నిన వ్యూహం బెడిసికొట్టింది. ప్రత్యర్థులపై రౌడీషీట్లు తెరిచి, పోలింగ్ ఏజెంట్లుగా అవకాశంలేకుండా చేయాలన్న ఆలోచన ఫలితం ఇవ్వలేదు. గత ఏడాది ఆగస్టు నాలుగో తేదీ పుంగనూరు శివార్లలోని భీమగానిపల్లె వద్ద కృష్ణదేవరాయల విగ్రహం వద్ద టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన సందర్భంగా గొడవ జరిగింది. పోలీసులు లాఠీచార్జి చేశారు. పోలీసులే ఫిర్యాదుదారులుగా టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డితోపాటు 498 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అదే సమయంలో రౌడీషీట్ అస్త్రాన్ని ప్రయోగించారు. మూడు కేసులున్న దాదాపు 100 మంది టీడీపీ నేతలపై రౌడీషీట్లు తెరిచారు. కానీ ఎన్నికల సంఘం నిబంధనలతో టీడీపీ శ్రేణులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా టీడీపీ అభ్యర్థి సంతకంతో ఉన్న పత్రాన్ని తీసుకుని ఏజెంటుగా కూర్చున్నారు.

అదనపు బలగాలెక్కడ?

- నాలుగు కేంద్రాలకూ ఒక్కరే కానిస్టేబుల్
- ఘర్షణల నియంత్రణలో పోలీసుల వైఫల్యం

చిత్తూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1,500 మందికిపైగా పోలీసు సిబ్బంది ఉండగా, మరో 1,500 మందికిపైగా అదనపు బలగాలను తెప్పించినట్లు పోలీసు అధికారులు చెప్పారు. 3 వేల మందికిపైగా పోలీసులతో పకడ్బందీగా ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అయితే జిల్లాలోని చాలా పోలింగ్ ప్రాంతాల్లో ఒకరే కానిస్టేబుల్ కనిపించారు. దీంతో ఘర్షణలను నిలువరించలేకపోయారు. ఎస్‌టీఎఫ్ బలగాలు వచ్చే సరికి జరగాల్సిన ప్రమాదం జరిగిపోయింది. చిత్తూరు నగరం మంగసముద్రంలో టీడీపీ శ్రేణులను వైసీపీ నాయకులు కొట్టాక బలగాలు వచ్చి చెదరగొట్టాయి. షర్మన్ వద్ద టీడీపీ అభ్యర్థి గురజాల వాహనానికి అడ్డుగా 10 నిమిషాలపాటు వైసీపీ నేత పురుషోత్తంరెడ్డి తన వాహనాన్ని అడ్డుపెట్టారు. అక్కడా పోలీసులు కనిపించలేదు. యాదమరి మండలం ముస్లింవాడలో దొంగ ఓట్లు వేసుకుంటున్న వైసీపీ వాళ్లను టీడీపీ శ్రేణులు అడ్డుకోగా కత్తులతో దాడి చేశారు. అక్కడా ఒక్కరే కానిస్టేబుల్ ఉండడంతో అడ్డుకోలేకపోయారు. అదే మండలం కాశిరాల, కోడిగుట్ట కేంద్రాల్లో వైసీపీ వాళ్లు ఓటర్లను బెదిరించి, కేంద్రాల్లోకి రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. అక్కడా ఒక్కడే కానిస్టేబుల్ ఉండడంతో వైసీపీ వాళ్లను నిలువరించలేకపోయారు. జీడీనెల్లూరు మండలం బాలగంగనపల్లె కేంద్రం వద్ద ఇరు పార్టీ వర్గాలు గుంపులుగా చేరుకుని వాగ్వాదం చేసుకున్నారు. ఇక్కడున్న కానిస్టేబుల్ నిలువరించలేక విఫలమయ్యారు. ఇలా ప్రతిచోటా పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది.

కలకలం రేపిన వీవీప్యాట్‌లోని చిత్రం

సోషల్ మీడియాలో హల్‌చల్



పలమనేరు, మే13 : పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కు వినియోగించుకునే వారు మాత్రమే చూడగలిగే వీవీప్యాట్‌లో ఓటు వేసిన చిత్రం సోమవారం పలమనేరులో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. వీవీప్యాట్‌లో ఓటు అమరనాథరెడ్డికి పోల్ చేసినట్లు సైకిల్ గుర్తుతోపాటు గ్రూప్ అడ్మిన్ మోహన్ సోషియల్ మీడియాలో పోస్టు చేశారు. సెల్‌ఫోన్లు పోలింగ్ కేంద్రంలోకి అనుమతి లేని సమయంలో ఈ చిత్రం బయటకు ఎలా వచ్చిందనేది పెద్ద చర్చనీయాంశంగా మారింది. పలమనేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి మనోజ్‌రెడ్డిని వివరణ కోరగా దర్యాప్తు చేస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మద్యం తాగి ఒకరి మృతి



వెంకటేష్ (ఫైల్ ఫొటో)

కార్వేటినగరం, మే 13: మద్యం తాగి కార్వేటినగరం పంచాయతీ ఆదిఆంధ్రవాడకు చెందిన వెంకటేష్(63) ఆదివారం రాత్రి మృతి చెందాడు. సోమవారం ఎన్నికల పోలింగ్ కావడంతో ప్రధాన పార్టీల నాయకులు రాత్రి మద్యం పంపిణీ చేశారు. పరిమితికి మించి తాగడంతో మృతిచెందినట్లు కాలనీవాసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కు చనిపోవడంతో దిక్కులేని వారయ్యారు.

కర్ణాటక మద్యం పట్టివేత : ఇద్దరి అరెస్ట్



కార్వేటినగరం, మే 13: కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పచ్చికాపలం వద్ద రూ.54 వేల విలువైన కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు స్పెష ల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి లక్ష్మీదుర్గయ్య తెలిపారు. వెదురుకుప్పం మండలం తెల్లగుండ్లపల్లి గ్రామానికి చెందిన చొక్కా ప్రతాప్ నుంచి 26 బాటిళ్లు, గోవిందవారిపల్లెకు చెందిన మల్లికార్జున నుంచి 32 కర్ణాటక మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని, ఇద్దరినీ రిమాండుకు తరలించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు నాగరాజు, భారతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడి మృతి



మృతిచెందిన గోవిందయ్య

శ్రీరంగరాజపురం, మే 13: రోడ్డు ప్రమాదంలో యాచకుడు మృతిచెందిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గోవిందస్వామి (70) రోడ్లపై చెత్త ఏరుకుంటూ, ఇంటింటికీ వెళ్లి యాచించి పొట్టపోసుకునేవాడు. ఎస్ఆర్‌పురం మండలం కనికపురం గ్రామ సమీపంలో రోడ్డుపై చెత్త ఏరుకుంటుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



చిత్తూరులోని జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బూత్‌లో వేచివున్న ఓటర్లు

మొరాయించిన ఈవీఎంలు

- పలుచోట్ల ఆలస్యంగా పోలింగ్

చిత్తూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఐరాల మండలంలోని పుత్రమద్ది, తవణంపల్లె లోని పుణ్యసముద్రం కేంద్రాలు, నింద్ర మండలం 184 కేంద్రం, కుప్పంలోని 168, 132, 197 కేంద్రాలు, వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగు, మాంబేడు, కార్వేటినగరంలోని 91 కేంద్రం, గుడిపాల మండలం పేయినపల్లె, వి.కోట మండలం 170, 171 కేంద్రాలు, కార్వేటినగరం మండలం 103 కేంద్రం, పాలసముద్రం మండలం శ్రీబొమ్మరాజుపురం, వి.కోట మండలం 196 కేంద్రం, శాంతిపురం మండలం శివరాంపురం, జీడీనెల్లూరు మండలం పాతవెంకటాపురం, చౌడేపల్లె మండలం 106, 107 తదితర కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. ఆలస్యంగా పోలింగ్ మొదలవడంతో చాలా కేంద్రాల్లో రాత్రి 10 గంటలకు కూడా ఓటర్లు క్యూలో ఉన్నారు. వి.కోట మండలం జొన్నపల్లె కేంద్రంలో, బంగారుపాళ్యం మండలం తంబుగానిపల్లెలో సుమారు 300 మంది రాత్రి క్యూలో ఉన్నారు. వి.కోట మండలంలో సుమారు 8 కేంద్రాల్లో, చౌడేపల్లె మండలంలోని ఐదు కేంద్రాల్లో, పులిచెర్ల మండలం మతుకువారిపల్లెలో, బంగారుపాళ్యంలోని కచ్చేటివారిపల్లెలో, గంగవరం మండలం కీళ్లపట్ల, కొత్తపల్లె, గంగవరం కేంద్రాల్లో, సోమల మండలం పొదలగుంటపల్లె, టీ.గొల్లపల్లె, పూతలపట్టు మండలం గొడుగుచింతలో రాత్రి 10 గంటలు దాటినా పోలింగ్ కొనసాగింది.



స్ట్రాంగ్ రూములకు చేరుకుంటున్న ఈవీఎంలు

చిత్తూరు కలెక్టరేట్, మే 13 : సార్వత్రిక ఎన్నికల పోటీలోని అభ్యర్థుల భవితవ్యం తేల్చే ఈవీఎం మిషన్లు సోమవారం రాత్రి 10 గంటల నుంచి చిత్తూరులోని ఎస్ వి సెట్ ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకుంటున్నాయి ఇక్కడ 10 రిసీవింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పీవో డెయిరీలతో పాటు ఎన్నికల్లో వాడిన పోలింగ్ సామగ్రిని అధికారులు అందజేస్తున్నారు. తొలుత చిత్తూరు అసెంబ్లీ నియోజవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు చేరుకున్నాయి. జిల్లాలో మిగిలిన ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలు గట్టి పోలీసు బందోబస్తు నడుమ తరలిస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి పూర్తి స్థాయిలో తరలించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్, జేసీ సమక్షంలో అర్ధరాత్రి నుంచి నియోజకవర్గాల వారీగా వాటిని భద్రపరుస్తారు.

వివాదాలు.. గొడవలు

ఆంధ్రజ్యోతి, చిత్తూరు: జిల్లాలో సోమవారం పోలింగ్ సందర్భంగా పలు కేంద్రాల్లో వివాదాలు, గొడవలు చోటుచేసుకున్నాయి.

డిజిటల్ అసిస్టెంట్‌పై జనాగ్రహం



వి.కోట మండలం కుంబార్లపల్లె కేంద్రంలో ఓటరు స్లిప్పుల్ని పంపిణీ చేయకుండా ఉంచుకున్నందుకు డిజిటల్ అసిస్టెంట్ మీద ఓటర్లు ఆగ్రహించారు. వైసీపీ స్లిప్పుల్ని పంపిణీ చేసి, మిగిలినవి అందించలేదని నిలదీశారు.

నమూనా ఈవీఎంతో..



వి.కోట మండలం తోటకనుమ పోలింగ్ కేంద్రం పక్కనే మోడల్ బ్యాలెట్‌తో వైసీపీ కార్యకర్తలు హల్‌చల్ చేశారు. దీనిపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. వి.కోటలోని బాలికోన్నత పాఠశాలలో సాయంత్రం ఆరు దాటినా ఓటు వేసేందుకు వచ్చిన వారిని అనుమతించాలనడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది.

- చౌడేపల్లె మండలం చారాల 119, 120 కేంద్రాల్లో ముగ్గురు వలంటీర్లు ఏజెంట్లుగా కూర్చున్నారని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో టీడీపీ- వైసీపీ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వలంటీర్లను కేంద్రం నుంచి పీవో పంపించేశారు.
- నగరి పట్టణంలోని కొత్తపేట తమిళ ఉన్నత పాఠశాల వద్ద వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య వాగ్వాదాం చోటు చేసుకోగా, పోలీసులు తరిమికొట్టారు.
- యాదమరి మండలం కాశిరాల, కోడిగుట్ట కేంద్రాల్లో వైసీపీ వాళ్లు ఓటర్లను బెదిరించి, కేంద్రాల్లోకి రాకుండా అడ్డుకున్నారని టీడీపీ నేతలు ఆరోపించారు. అక్కడ ఒకరే కానిస్టేబుల్ ఉండడంతో నిలువరించలేకపోయారని ఫిర్యాదు చేశారు.
- చిత్తూరు నగరం 24, 27 పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ కార్పొరేటర్ హరిణిరెడ్డి ఓటర్లకు బహిరంగంగా డబ్బులు పంపిణీ చేసినా పోలీసులు పట్టించుకోలేదని టీడీపీ నాయకులు ఆరోపించారు.
- పూతలపట్టు మండలం సంజీవరాయునిపల్లె పోలింగ్ కేంద్రంలో వైసీపీ నేతలు ఓటర్ల నుంచి స్లిప్పుల్ని లాక్కుని దొంగ ఓట్లు వేసే ప్రయత్నాన్ని టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ అడ్డుకున్నారు.

'స్టేటస్'లో మాక్‌పోలింగ్ ఫొటో

- వైసీపీ సర్పంచిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

రామకుప్పం, మే 13: రామకుప్పం మండలం ముద్దనపల్లె పోలింగ్ బూత్‌లో మాక్ పోలింగ్ ఫొటోను తీసి వైసీపీకి చెందిన సర్పంచు సికిందర్ తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టారు. వాట్సాప్ స్టేటస్‌ను స్థానికులు స్క్రీన్‌షాట్ తీసి పోలీసులకు పంపారు. దీనిపై స్పందించిన పోలీసులు సికిందర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కుప్పంలో 'ఓటెత్తిన' జనం!

- ననియాలతాండాలో టీడీపీ కార్యకర్తలపై ఎమ్మెల్సీ భరత్ గన్‌మెన్ దౌర్జన్యం
- సింగసముద్రంలో మాక్ పోలింగ్ దృశ్యాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసిన ముద్దనపల్లె వైసీపీ సర్పంచి
- మొదటి గంటలో మొరాయించిన ఈవీఎంలు
- కిక్కిరిసిన క్యూలైన్లు ● కుప్పం 85.87 శాతం పోలింగ్
- సాయంత్రం 6 గంటల తర్వాత టోకెన్ల కోసం తొక్కిసలాటలు

కుప్పం, మే 13: జిల్లాలోనే చిట్టచివరిదైన కుప్పం నియోజకవర్గంలో సోమవారం జరిగిన పోలింగ్ చెరుదుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా జరిగింది. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి జనం పోటెత్తారు. క్యూలైన్లు ఓటర్లతో కిక్కిరిశాయి. పోలీసు బందోబస్తు తగినంతమంది లేకపోవడం, క్యూలైన్ల నిర్వహణ కనిపించకపోవడంతో కుప్పం గ్రామీణ ప్రాంతంలో పలు పోలింగ్ బూత్‌లలో ఓటర్లు గుంపులు గుంపులుగా ఒకరినొకరు తోసుకుంటూ నిలబడ్డారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాల్సి ఉండగా ఆరున్నర గంటలనుంచే ఓటర్లు క్యూలైన్లలో వేచి చూశారు. ఈవీఎంలు పలుచోట్ల మొరాయించడంతో పోలింగ్ దాదాసే గంట ఆలస్యమైంది. రామకుప్పం మండలంలో ఎమ్మెల్సీ భరత్ గన్‌మెన్, టీడీపీ కార్యకర్తలపై జులుం ప్రదర్శించడం, అదే మండలంలో మాక్ పోలింగ్ దృశ్యాన్ని ఒక వైసీపీ సర్పంచి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం తప్ప నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సాయంత్రం 6 గంటల తర్వాత కూడా క్యూలైన్లలో ఓటర్లు బారులు తీరి కనిపించారు. టోకెన్లకోసం కొన్నిచోట్ల స్వల్పంగా తొక్కిసలాటలు చోటు చేసుకున్నాయి. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు తదితరులు నియోజవకర్గ వ్యాప్తంగా తిరుగుతూ పోలింగ్ సరళిని పరిశీలించారు.

● రామకుప్పం మండలం నినియాల తాండాలో భోజనం చేస్తున్న టీడీపీ కార్యకర్తలపై వైసీపీ ఎమ్మెల్సీ భరత్ గన్‌మెన్ దౌర్జన్యం చేశారని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. అదే సమయంలో టీడీపీ కార్యకర్తలే తమపై దౌర్జన్యానికి పాల్పడినట్లు భరత్ కూడా ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన సందర్భంగా పోలింగ్ బూత్ సమీపంలో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తత ఏర్పడింది.

● రామకుప్పం మండలం సింగసముద్రం పోలింగ్ బూత్‌లోకి నలుగురైదుగురు అనుచరులతో కలసి వెళ్లిన వైసీపీ ఎమ్మెల్సీ భరత్ తలుపులు మూసేశారు. అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో తర్వాత తలుపులు తెరుచుకుని వెనక్కు వచ్చేశారు. ఆయన అటు వెళ్లగానే వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య తోపులాటలు జరిగాయి.

● మాక్ పోలింగ్ దృశ్యాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారన్న కారణంతో రామకుప్పం మండలం ముద్దనపల్లె వైసీపీ సర్పంచి సికిందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

● కుప్పంలోని 263 పోలింగ్ బూత్‌లో గాయత్రి యువతి వచ్చేసరికి ఆమె ఓటును ఎవరో వినియోగించేసుకోవడంతో కన్నీటిపర్యంతమైంది.

● టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కుప్పంలోని 166వ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● కుప్పం మండలం కంగుంది. నడిమూరు గ్రామాలలో వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య చిన్నపాటి తోపులాటలు జరిగాయి.

● కుప్పం పురపాలక సంఘం పరిధిలోని పోలింగ్ బూత్‌లలో ఉదయం 7 గంటలకుముందే ఓటర్లు బారులు తీరి కనిపించారు.

● కుప్పం కొత్తపేటలోని 177, 178, 179, 180 పోలింగ్ బూత్‌లతోపాటు, నియోజకవర్గంలో సుమారు 75 శాతం పోలింగ్ బూత్‌లలో మొదటి గంట ఈవీఎంలు మొరాయించాయి. ఫలితంగా పోలింగ్ కనీసం గంట ఆలస్యమైంది.

● ఈవీఎంల మొరాయింపుతో పోలింగ్ ఆలస్యమైంది. ఈ కారణంలో సాయంత్రం ఆరు దాటాక కూడా ఒక్కో పోలింగ్ కేంద్రం వద్ద సుమారు 300-500ల దాకా ఓటర్లు క్యూలైన్లలో కనిపించారు. గేట్లు మూసి వీరందరికీ పోలింగ్ సిబ్బంది టోకెన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓటర్ల మధ్య తోపులాటలు, తొక్కిసలాటలు సైతం చోటు చేసుకున్నాయి.

● క్యూలైన్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో కుప్పం మండలం మంకలదొడ్డి, చెక్కునత్తం పోలింగ్ బూత్‌లతోపాటు ఇంకా పలు బూత్‌ల వద్ద ఓటర్లు గుంపులు గుంపులుగా ప్యాక్ అయిపోయి కనిపించారు. అధిక శాతం గ్రామీణ బూత్‌ల వద్ద ఒక్కో పోలీసు కానిస్టేబుల్‌నే ఉంచడంతో ఓటర్లను అదుపు చేయడం సాధ్యం కాలేదు.

● పోలింగ్ రాత్రి 9-10 గంటలదాకా సాగినా ఓటర్లు ఓపిగ్గా నిరీక్షించి మరీ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

● వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు సైతం తమతమ ఇబ్బందులను, అసౌకర్యాలను పక్కనపెట్టి మరీ ఓటింగ్‌కు తరలివచ్చారు.

● గుడుపల్లె మండలం శెట్టిపల్లె బూత్ పరిశీలనకు వచ్చిన ఎంపీ రెడ్డెప్పను స్థానిక టీడీపీ నాయకులు నిలదీశారు. ఈ అయిదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య చిన్నపాటి ఘర్షణ వాతావణం ఏర్పడింది.

● గుడుపల్లె మండలంలోని శెట్టిపల్లె, సోడిగానిపల్లెల్లో ఈవీఎంలు గంటకు పైగా మొరాయించడంతో ఓటర్లు అవస్థలు పడ్డారు.



వసనాడు గ్రామంలో క్యూలైన్లలో బారులుతీరిన మహిళా ఓటర్లు





కుప్పంలో ఓటు వేసి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, తన ఓటు ఎవరో వేసేశారని వాపోతున్న యువతి గాయత్రి

రాత్రి 9 వరకు కొనసాగిన పోలింగ్



కల్లూరులో చంటి బిడ్డతో ఓటు వేసేందుకు వస్తున్న ఓటరు

కల్లూరు, మే 13: పులిచెర్ల మండలంలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. రాత్రి 7 గంటలకు మతుకువారిపల్లి మినహా మిగిలిన పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ముగిసే సమయానికి 27393 మంది ఓటర్లు తమ ఓటుహక్కును విని యోగించుకున్నారు. పురుషులు 13544, స్త్రీలు 13848 మంది ఓటుహక్కును విని యోగించుకున్నారు. 86.22 శాతంగా నమోదైనట్లు తహశీల్దార్ వసంతలత తెలిపారు. ఉదయం నుంచే ఓటర్లు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలి రావడంతో ఎక్కడ చూసినా క్యూలైన్లు దర్శనమిచ్చాయి. మతుకువారిపల్లి 233 పోలింగ్ కేంద్రంలో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

రాత్రి 8గంటల వరకు పోలింగ్



దాసార్లపల్లెలో ఓటువేయడానికి వచ్చిన లక్ష్మమ్మ(101)

బైరెడ్డిపల్లె, మే 13 : బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో సోమవారం రాత్రి 8గంటల వరకు పోలింగ్ కొనసాగింది. సాయంత్రం 6గంటలకే పోలింగ్ సమయం ముగిసినప్పటికీ చాలామంది ఓటర్లు అప్పటికే క్యూలైన్లలో వుండడంతో పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఇంకా మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఇదేవిధంగా పోలింగ్ జరిగింది. పలుచోట్ల మహిళలు, యువత ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు.

రామకుప్పంలో 84.7శాతం పోలింగ్

రామకుప్పం, మే 13: రామకుప్పం మండలంలో 84.7శాతం పోలింగ్ నమోదైంది. కెంపసముద్రం, ముద్దనపల్లె, మిట్టపల్లె పోలింగ్ బూత్‌లతో బాటూ మరికొన్ని పోలింగ్ బూత్‌లలో 90శాతం పైగా పోలింగ్ శాతం నమోదైంది. విజలాపురం 90వ పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో అక్కడ ఒకటిన్నర గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. మణీంద్రంలోని 89వ పోలింగ్ బూత్‌లో మధ్యాహ్నం 2:45 గంటలు నుంచి గంటపాటు ఈవీఎం పనిచేయక పోలింగ్ ఆగిపోయింది.

ఆట విడుపు



పలమనేరు, మే13 : అభ్యర్థులు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటింగ్ సరళిని పరిశీలిస్తూ క్షణం తీరికలేకుండా గడుపుతారు. ఇందుకు భిన్నంగా పలమనేరు వైసీపీ అభ్యర్థి వెంకటేగౌడ మాత్రం సోమవారం వి.కోట మండలం బోడిగుట్లపల్లిలో యువకులతో కలిసి క్రికెట్ ఆడారు.

పలు చోట్ల మొరాయించిన ఈవీఎంలు



తిమ్మరాజుపల్లె బూత్‌లో వీల్ చైర్‌లో ఓటు వేసేందుకు వెళ్లుతున్న దివ్యాంగురాలు

శాంతిపురం, మే 13 : శాంతిపురం మండలంలో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. అక్కడక్కడా వైసీపీ నేతలు కవ్వింపు చర్యలు తప్ప ఎలాంటి గొడవలు లేకుండా ఎన్నికలు జరిగాయి. అయితే పలు చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. ఉదయం 7 గంటలకే ఓటర్లు క్యూ కట్టారు. మహిళలు బారులు తీరారు. సంతూరు, శివరామపురం, 64పెద్దూరు, రాళ్లబూదుగూరు పోలింగ్ స్టేషన్‌లో ఈవీఎంలు మొరాయించాయి. సుమారు గంటకుపైగా మొరాయించడంతో పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. ఓటర్లు పడిగాపులు కాశారు. తరువాత అధికారులు వాటిని సరిచేయడంతో ఓటింగ్ కొనసాగింది. శివరామపురం పోలింగ్ స్టేషన్ వద్ద వైసీపీ నేతలు పార్టీ కండవాలు కప్పుకొని ప్రచారం చేయడంతో టీడీపీ వారు అభ్యంతరం చెప్పారు. వైసీపీ కార్యకర్తలు వినక పోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. వెంటనే పోలీసులు వారిని చెదురుగొట్టి ప్రశాంతంగా పోలింగ్ సాగింది. వడగాండ్లపల్లె పోలింగ్ బూత్‌లో వంద సంవత్సరాలు వృద్ధుడు ఓటు వేశాడు. కుటుంబ సభ్యులు ఆయన్ను ఎత్తుకు వచ్చి ఓటు వేయించారు. అలాగే తిమ్మరాజుపల్లె బూత్‌లో దివ్యాంగురాలు వీల్‌చైర్‌లో వెళ్లి ఓటు వేసింది. సాయంత్రం ఆరు గంటల తర్వాత గేట్లు వేసేయడంతో అప్పటివరకు క్యూలో ఉన్న ఓటర్లు అర్ధరాత్రి వరకు ఎదురుచూసి ఓట్లు వేశారు. వెంకటేపల్లె పోలింగ్ బూత్‌లో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పెద్దపంజాణిలో ప్రశాంతంగా ముగిసిన ఓటింగ్

పెద్దపంజాణి మే 13: పెద్దపంజాణి మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం మండలంలోని 25 పంచాయతీలలోని 49 బూత్‌లలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లు అన్ని బూత్‌ల వద్ద తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉదయం 6 గంటల నుంచి బారులు తీరారు. మండలంలో 46657 ఓట్లున్నాయి. కొన్ని బూత్‌లలో రాత్రి 9 గంటలైనా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పడిగాపులు గాసి ఓటుహక్కు వినియోగించుకున్నారు.

గుడుపల్లెలో రాత్రి వరకు కొనసాగిన పోలింగ్



అగరంలో పోలింగ్ బూత్ వద్ద క్యూలో ఉన్న ఓటర్లు

గుడుపల్లె, మే 13: గుడుపల్లె మండలంలో ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 35,458 ఓట్లకు గాను 42 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచి ఓట్లు వేయడానికి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. శెట్టిపల్లె, సోడిగానిపల్లె పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమై రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు ఉండడంతో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

రామకుప్పంలో ఉద్రిక్తత మధ్య పోలింగ్

- సింగసముద్రంలో టీడీపీ నేతలపై వైసీపీ శ్రేణుల దాడి
- ఇద్దరు టీడీపీ నేతలకు గాయాలు
- నినియాలలో టీడీపీ వర్సెస్ ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం, మే 13: రామకుప్పం మండలంలో ఉద్రిక్తత మధ్య పోలింగ్ జరిగింది. పలుచోట్ల వైసీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడుతూ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేశారు. సింగసముద్రంలో ఎమ్మెల్సీ భరత్ తన అనుచరులతో కలిసి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి తలుపు మూసుకున్నారని, తాము తలుపును బలంగా తట్టడంతో తీశారని టీడీపీ శ్రేణులు తెలిపారు. ఈ సంఘటన జరిగిన సమయంలో పలువురు వైసీపీ కార్యకర్తలు పోలింగ్ కేంద్రం ఆవరణలోనే తిష్ట వేసి, ప్రచారం చేస్తుండటంతో టీడీపీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరు పార్టీల శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పెద్దసంఖ్యలో వైసీపీ శ్రేణులు బారికేడ్లను దాటుకుని దూసుకువచ్చి టీడీపీ శ్రేణులపై విచక్షణ రహితంగా మూకుమ్మడి దాడి చేశారు. ఈ దాడిలో టీడీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కుప్పిగానిపల్లెకు చెందిన శ్రీనివాసులు గాయాలకు గురయ్యారు. ఎమ్మెల్సీ భరత్ ప్రోద్బలంతోనే వైసీపీ శ్రేణులు రెచ్చిపోయి దాడికి దిగారని టీడీపీ శ్రేణులు తెలిపారు. సింగసముద్రం నుంచి ఎమ్మెల్సీ భరత్ నినియాలకు చేరుకున్నపుడు అక్కడ కూడా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ ఉద్రిక్తతలకు సంబంధించి రెండు పార్టీల వారు వేర్వేరు వాదనలు వన్పించారు. నినియాలో రోడ్డు పక్కన టీడీపీకి చెందిన వారు టిఫిన్ చేస్తుండగా ఎమ్మెల్సీ భరత్ తన అనుచరులతో కలిసి తమపై దాడికి పాల్పడ్డాడని టీడీపీ శ్రేణులు ఆరోపించాయి. కాగా అడ్డుకోబోయిన ఎమ్మెల్సీ గన్‌మన్‌పై టీడీపీ నాయకులు దాడిచేశారని వైసీపీ వారు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీతో పాటు పలువురిపై ఫిర్యాదు

నినియాలలో తమ బంధువులు అందరం కలిసి సోమవారం ఉదయం అల్పాహార విందు ఏర్పాటు చేసుకుంటుంటే ఎమ్మెల్సీ భరత్‌తో బాటూ వైసీపీ మండల కన్వీనర్, ఇతర వైసీపీ నేతలు తమను కొట్టారని నినియాల తాండాకు చెందిన రామూనాయక్ రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులో ఆయన పేర్కొన్న మేరకు వివారాలు...నినియాలకు చెందిన సుగాలీ బంధువులు ఉదయం 11గంటలకు అల్పాహార విందులో పాల్గొన్నారు. వారు అల్పాహారం తీసుకుంటుండగా ఎమ్మెల్సీ భరత్ తన అనుచరులతో వచ్చి ఎన్నికల సమయంలో ఇలా విందులు ఏర్పాటు చేసుకోరాదని వారికి సూచించారు. దీనిపై ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ జరిగింది. ఇదిలా ఉండగా నినియాలలో టీడీపీ శ్రేణులతో బాటు గన్‌మన్‌పై దాడికి పాల్పడినట్టు ఎమ్మెల్సీ భరత్ రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

పలమనేరులో ప్రశాంతంగా పోలింగ్

పలమనేరు, మే13: ఉదయం 6.30 నిముషాలకే ఓటర్లు అధికసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకొని బారులు తీరారు. పట్టణంలో కొన్ని చోట్ల ఉదయం 15 నిముషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. మహిళలు, వృద్ధులు తమ కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకొనేందుకు యువతీ యువకులు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. సాయంత్రం 6గంటలకు పోలింగ్ సమయం ముగిసినా ఓటర్లు క్యూ లైన్లలో ఉండడంతో పలు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 8 గంటలకు, కొన్ని కేంద్రాల్లో 9 గంటల వరకు కూడా పోలింగ్ కొనసాగింది. రాత్రి పొద్దుపొయ్యేవరకు కూడా పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ కొనసాగింది. పలమనేరు నియోజకర్గంలో 82.99 శాతం పోలింగ్ జరిగింది. పాలిటెక్నిక్ కళాశాల వద్ద తెలుగుదేశం, వైసీపీ నాయకులు వాగ్వాదానికి దిగగా సీఐ చంద్రశేఖర్ జోక్యం చేసుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు. అలాగే మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో ముగ్గురు మహిళలు తాము ఫ్యాన్‌గుర్తుకు వేయాలని కోరినా పోలింగ్ మహిళా సిబ్బంది తమచేతులు పట్టుకుని సైకిల్‌గుర్తుపై ఓట్లు వేయించారని ఆర్‌ఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకొంటామని వైసీపీ నాయకులు మండీసుదా, హేమంత్‌కుమార్‌రెడ్డిలకు ఆర్‌వో హామీ ఇచ్చారు.

సొంతూళ్లలో అభ్యర్థుల ఓటింగ్

పలమనేరు టీడీపీ అభ్యర్థి అమరనాథరెడ్డి పెద్దపంజాణి మండలంలోని తన స్వగ్రామమైన కెలవాతిలో సతీమణి రేణుకారెడ్డి, కుమారుడు ప్రసేన్‌రెడ్డిలతో కలిసి ఓటు వేశారు. వైసీపీ అభ్యర్థి వెంకటేగౌడ వి.కోట మండలం తోటకనుమలోని తన స్వగ్రామంలో ఓటు వేశారు. ఆర్‌ఓ మనోజ్‌రెడ్డి గంగవరంలో తన ఓటు హక్కు వినియోగించుకొన్నారు.



తోటకనుమలో భార్య పావనితో కలిసి ఓటు వేసిన వైసీపీ అభ్యర్థి వెంకటేగౌడ



కెలవాతిలో భార్య రేణుకారెడ్డి, కుమారుడు ప్రసేన్‌రెడ్డితో కలిసి ఓటు వేసిన అమరనాథరెడ్డి



పలమనేరు బాలికోన్నత పాఠశాలలో బారులు తీరిన ఓటర్లు



పలమనేరులో ఓటు వేసిన శతాధిక వృద్ధురాలు పద్మావతమ్మ

వైసీపీ, టీడీపీ ఘర్షణ

బైరెడ్డిపల్లె, మే 13 : బైరెడ్డిపల్లెలో సోమవారం పోలింగ్ కేంద్రానికి సమీపంలో మెయిన్‌రోడ్డులో వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య వాగ్వాదాలు, తోపులాటలు చోటు చేసుకున్నారు. దీంతో కొంతసేపు పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలింగ్ కేంద్రం ఆవరణలోకి వైసీపీ శ్రేణులు అదేపనిగా వెళ్లివస్తున్నారని టీడీపీ శ్రేణులు అభ్యంతరం తెలిపారు. దీనిపై ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఎస్‌ఐ కృష్ణయ్య ఇరువర్గాలకు సర్దిచెప్పి పోలింగ్‌కేంద్రం నుంచి బయటకు పంపారు. అదే సమయంలో వైసీపీ వారు దౌర్జన్యం చేశారని టీడీపీ శ్రేణులు కొంతసేపు నిరసన తెలియజేశారు. మళ్లీ కొంతసేపటికి మెయిన్‌రోడ్డులో ఇరు వర్గాలు ఘర్షణకు దిగడంతో పరిస్థితి మళ్లీ మొదటి కొచ్చింది. దీంతో బందోబస్తుకు వచ్చిన పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అయితే టీడీపీ వారు దౌర్జన్యం చేశారని వైసీపీ వారు పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. అదేవిధంగా బాపలనత్తం గ్రామంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ శ్రేణులు దాడిచేయడంతో వారిని చికిత్స నిమిత్తం పలమనేరుకు తరలించారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

చౌడేపల్లె, మే13: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టదమృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా సోమవారం ప్రారంభమయ్యాయి.

రొంపిచెర్లలో 78 శాతం పోలింగ్

రొంపిచెర్ల, ఏప్రిల్ 13: రొంపిచెర్ల మండలంలో సాయంత్రం వరకు 78 శాతం పోలింగ్ జరిగింది. రాత్రి వరకు కొనసాగింది. రొంపిచెర్ల ప్రాథమిక పాఠశాల, బండకిందపల్లె పాఠశాలలోని పోలింగ్ బూత్‌ల వద్ద ఓటు హక్కు వినియోగం కోసం జనం బారులు తీరారు. దీంతో అధికారులు క్యూలో ఉన్న వారందరికీ ఓటేసే అవకాశం కల్పించారు. మోటుమల్లెల పంచాయతీ వంకిరెడ్డిగారిపల్లె బూత్ వద్ద వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ జరిగితే పోలీసులు చెదరగొట్టారు. చిచ్చిలివారిపల్లె బూత్ వద్ద ఓటర్ల ను ప్రలోభపెడుతున్న ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, ఆయన కుమారుడుకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లాబాబు సతీమణి సుప్రియారెడ్డి, ఏజెంట్‌గా ఉన్న టీడీపీ మండల అధ్యక్షుడు ఉయ్యాలరమణల మధ్య వివాదం జరిగింది. ఇదిలా ఉండగా వారణాసివారిపల్లెకు చెందిన క్రిష్ణయ్య(90)ను ఆయన కుమారుడు కిషోర్ మరొకరి సాయంతో ఎత్తుకొని రొంపిచెర్లలోని పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చారు. అక్కడ ఆయన ఓటు వేశారు.

పేరుకే 144 సెక్షన్..!

చౌడేపల్లె, మే13: చౌడేపల్లె మండలంలో రాత్రి 8 దాటినా పలు కేంద్రాలలో పోలింగ్ జరిగింది. సోమవారం మండంలోని కాటిపేరి, కాగతి, పరికిదొన, ఎ.కొత్తకోట, కొలింపల్లె పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు ఉత్సాహంగా ఓట్లు వేశారు. కాటిపేరి, కాగతి పోలింగ్ కేంద్రాలలో రాత్రి 9 వరకు పోలింగ్ కొనసాగింది. చారాలలోని 121వ బూత్‌లో 95 శాతం, గడ్డంవారిపల్లె పంచాయతీలోని బత్తలాపులోని 112వ బూత్‌లో 94.7 శాతం, దాదేపల్లె లోని 123వ బూత్‌లో 94 శాతం ఇలా పలు బూతులలో 90 శాతం కంటే ఎక్కువ పోలింగ్ జరిగింది. కాగా చారాల పంచాయతీలో 120, 121 బూత్‌లలో ముగ్గురు వలంటీర్లు ఏజెంట్లుగా కూర్చోవడంపై టీడీపీ శ్రేణులు అభ్యంతరం తెలిపారు. వైసీపీ శ్రేణులు మాత్రం వారినే ఏజెంట్లుగా కూర్చోబెట్టడంతో ఇరువర్గాల నడుమ వాగ్వాదం జరిగింది. పోలీసులు ఇరువర్గాలను పోలింగ్ కేంద్రానికి దూరంగా పంపేశారు. ఈవిషయంపై ఆర్వోకు టీడీపీ శ్రేణులు ఫిర్యాదు చేశారు. మండలంలో 144 సెక్షన్ ఉన్నా ఎక్కడా సక్రమంగా అమలు కాకపోవడం గమనార్హం.

జాడలేని కేంద్ర బలగాలు

సోమల, మే 13: పోలింగ్ కేంద్రాల వద్ద వివాదాలు జరుగుతున్నా పోలీసుల ప్రేక్షక పాత్ర వహించారు. కేంద్ర బలగాల జాడే లేదు. సోమల స్వయంభేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న పోలింగ్ బూత్ 147 వద్ద చిన్న సోమల, వడ్డిపల్లె, భారతం మిట్ట, మఠం గొల్లపల్లె, ముండ్రి వారిపల్లె, గన్నావారిపల్లె ఓటర్లు బారులు తీరారు. ఒకే పోలీసు ఇక్కడ విధులు నిర్వహించారు. పైగా ఈవీఎం అర గంట మొరాయించడంతో ఓటర్లు క్యూలో ఉండలేక అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన అభ్యర్థులు

సోమల, మే 13: సోమల మండలంలో ఎన్నికల పోలింగ్ సరళిని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి, వైసీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరిశీలించారు. సోమవారం మధ్యాహ్నం సోమల హైస్కూల్ వద్ద ఓటర్లను కలిశారు. కందూరు వద్ద బీజేపీ రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. కాగా సోమల హైస్కూల్ వద్ద టీడీపీ నాయకుడు వెంకట్రమణరాజు పోలింగ్ బూత్ 144లోకి ప్రవేశిస్తుండగా వైసీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు.

పుంగనూరులో ఓటరు ఉత్సాహం

- 83.24 శాతం పోలింగ్
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- దొంగ ఓట్లపై టీడీపీ- వైసీపీ నడుమ వాగ్వాదం
- కందూరు, ఆవులపల్లెలో వైసీపీ, టీడీపీల మధ్య ఘర్షణ

పుంగనూరు, మే13: పుంగనూరు నియోజకవర్గంలో సోమవారం జరిగిన పోలింగ్‌లో చెదురుముదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 262 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ అధికారులు ఉదయాన్నే మాక్‌పోలింగ్ నిర్వహించి ఓటర్లను అనుమతించారు. పుంగనూరులో మేలుపట్ల, భగత్‌సింగ్‌కాలనీ, సదుం మండలం బూరగమంద, చౌడేపల్లె మండలం కొండయ్యగారిపల్లె తదితర ప్రాంతాలల్లో ఈవీఎంలు మొరాయించడం వల్ల ఓటర్లు ఇబ్బంది పడ్డారు. అధికారులు గంటలోపు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడంతో పోలింగ్ కొనసాగింది. నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ఎన్నికల పరిశీలకులు కవిత, నవాజ్‌అహ్మద్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఉదయం 7గంటల నుంచే మహిళలు, వృద్ధులు, యువత ఓటు వేయడానికి క్యూకట్టారు. అధికంగా మహిళా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్‌కాస్టింగ్ రికార్డింగ్ జరగగా పుంగనూరు ఎన్నికల రిట్నంగ్ అధికారి వై. మధుసూధన్‌రెడ్డి ఏఆర్వోలు నరసింహప్రసాద్‌రెడ్డి, శివయ్యలు ఆర్వో కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల ఓటింగ్ తీరును వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. బూరగమందలో టీడీపీ ఎన్నికల పోలింగ్ ఏజెంట్లు ఉన్నారని, పోలింగ్ ప్రశాంతంగా సాగుతున్నట్లు ఆర్వో ప్రకటిస్తూ ఎన్నికల సంఘానికి నివేదిక పంపారు. పుంగనూరు ప్రభుత్వ బసవరాజ హైస్కూల్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటలకు ఓటర్లు లేక పోలింగ్ కేంద్రాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. మధ్యాహ్నం ఎండ వేడితో సాయంత్రం ఓటర్లు అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడంతో పోలింగ్ రాత్రి వరకు కొనసాగింది. ● సదుంలో 77 శాతం పోలింగ్ నమోదైంది. రొంపచెర్లలో 78 శాతం ఓటింగ్ జరిగింది.

దొంగ ఓట్లు..పలుచోట్ల వాగ్వాదాలు

పుంగనూరు నాగపాళ్యం లినార్డు స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఉదయం నుంచే వైసీపీ శ్రేణులు, ఏజెంట్లు కలసి దొంగ ఓట్లు వేయడానికి తీవ్ర ప్రయత్నం చేశారు. ఓటర్ చీటీ, గుర్తింపుకార్డు లేకుండా పదే పదే దొంగ ఓటర్లు వస్తుండటంతో టీడీపీ ఏజెంటు సుహేల్‌బాషా అభ్యంతరం చెప్పడంతో వైసీపీ ఏజెంట్ నిజాం గొడవకు దిగాడు. ఇరువురి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. ఎస్పీ సురేశ్‌బాబు పోలింగ్ కేంద్రం వద్ద విచారించి పోలింగ్ అధికారిని కఠినంగా వ్యవహరించాలని ఇద్దరి ఏజెంట్లను బయటకు రావాలని సూచించారు. తాటిమాకులపాళ్యంలోని పోలింగ్‌కేంద్రంలో వైసీపీకి ఓట్లు వేయాలని ప్రచారం చేయడంపై టీడీపీ నాయకుడు దేశాద్రిప్రకాశ్, వైసీపీ కౌన్సిలర్ నటరాజల మధ్య వాగ్వాదం జరిగింది. ఎంబీటీ రోడ్డు సమీపంలోని ఉర్దూ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద ఎస్‌డీపీఐ, వైసీపీ నాయకుల మధ్య తోపులాటలు జరిగాయి. పోలీసులు ఇరువర్గాలకు సర్ధిచెప్పారు. పుంగనూరు కొత్తయిండ్ల పోలింగ్ బూత్‌లో దొంగ ఓట్లు అడ్డుకున్నారని వైసీపీ వారు టీడీపీ ఏజెంట్లపై దాడి చేయడానికి తరలిరావడంతో ఏఎస్పీ సుబ్బరాజు ఆధ్వర్యంలో పోలీసులు చెదరగొట్టారు. ఏజెంట్లను పోలీసు బందోబస్తుతో ఇళ్లకు పంపారు.


● సోమల మండల ఆవులపల్లె పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ, టీడీపీ కార్యకర్తలు క్యూలైన్ వద్ద ప్రచారం చేస్తున్నారని పరస్పరం ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో మల్లేశ్వరం పురానికి చెందిన టీడీపీ కార్యకర్త గిరినాయుడు స్వల్పంగా గాయపడ్డాడు. అలాగే కందూరు హైస్కూల్ వద్ద జరిగిన వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో టీడీపీకి చెందిన మాజీ సర్పంచు ఓబులేసు, నౌషాద్ గాయపడడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైసీపీ వర్గానికి చెందిన గాలి సురేశ్‌రెడ్డి గాయపడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక పుంగనూరు, చౌడేపల్లె, సదుం మండలాల్లోని అనేక పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 10గంటల వరకు ఓటింగ్ సాగింది.

ఓట్లు వేసిన అభ్యర్థులు

సదుం మండలం ఎర్రాతివారిపల్లెలో వైసీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి కుటుంబీకులతో కలసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లెలో కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు. బీసీవై పార్టీ అభ్యర్థి పుంగనూరులో బోడే రామచంద్రయాదవ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. చిత్తూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి ఎన్.రెడ్డెప్ప పుంగనూరు ఎల్‌ఐసీ కాలనీలో ఓటు వేశారు. ఎస్‌డీపీఐ అభ్యర్థి అన్వర్‌బాషా పుంగనూరులో, బీఎస్పీ అభ్యర్థి సురేశ్ చౌడేపల్లె మండలం మేకలచిన్నేపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కలికిరి మండలం నగిరిపల్లెలో కుటుంబంతో కలసి ఓటు వేశారు. కాగా మంత్రి పెద్దిరెడ్డి సొంత మండలం సదుంలో కిరణ్‌కుమార్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

కనిపించని బందోబస్తు

రాష్ట్రంలోనే అత్యంత సమస్యాత్మక నియోజకవర్గంగా పుంగనూరును ప్రకటించినా పోలింగ్ కేంద్రాల్లో మాత్రం పోలీస్ బందోబస్తు ఏర్పాటులో విఫలమైంది. వందలాదిమంది ఓటర్లు ఉన్న పోలింగ్ బూత్‌లో ఒక్క కానిస్టేబుల్ ఉండటం మరి కొన్ని చోట్ల ఎన్‌సీసీ క్యాడెట్లు, తమిళనాడు హోంగార్డులు మాత్రమే కనిపించారు.



ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి పెద్దిరెడ్డి, ఆయన కుటుంబీకులు



కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేసిన చల్లా రామచంద్రారెడ్డి



సదుం పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి

నేడు గంగజాతర చాటింపు

చిత్తూరు కల్చరల్ : నడివీధి గంగజాతర చాటింపును మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. అదేరోజురాత్రి గంగినేనిచెరువు పార్కు వద్ద ఉన్న అమ్మవారి ఆలయంనుంచి గెరిగను తీసుకొచ్చి పొన్నియమ్మన్ గుడిలో పూజలు చేస్తారు. అనంతరం జాతర ప్రదేశంలో పూజలు చేయనున్నట్లు తెలిపారు.

వైసీపీ అభ్యర్థి దురుసు ప్రవర్తన!

- టీడీపీ శ్రేణులను చెప్పుతో కొడతానని హెచ్చరిక
- మాంబేడులో ఏర్పాట్లు విఫలం




శ్రీరంగరాజపురం మండలం కొత్తపల్లెమిట్ట వద్ద క్యూలో ఓటర్లు, సిద్దేశ్వరకొండలో ఓటేసేందుకు క్యూలో మహిళా ఓటర్లు

వెదురుకుప్పం, మే 13: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో సోమవారం జరిగిన పోలింగ్‌లో అక్కడక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వెదురుకుప్పం మండలం దేవళంపేట పోలింగ్ కేంద్రం వద్దకు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి వెళ్లిన సందర్భంగా ప్రధాన పార్టీల నాయకుల మధ్య వివాదం చెలరేగింది. ఈ క్రమంలో కృపాలక్ష్మి దురుసుగా వ్యవహరించి చెప్పుతో కొడతానని చెప్పు చూపించే ప్రయత్నం చేశారు. దీంతో పోలింగ్ కేంద్ర వద్ద ఉద్రిక్తత నెలకొంది. తిప్పినాయుడుపల్లె పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య నెలకొన్న వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. పచ్చికాపల్లం పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ శ్రేణులు రచ్చకు దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ క్రమంలో వైసీపీ ద్వితీయశ్రేణి నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మాంబేడు పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేయకపోవడంతో ఓటర్లు గుంపులు గుంపులుగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకున్నా ఓ దశలో కట్టడి చేయలేకపోయారు. మాంబేడు, ఆళ్లమడుగు పోలింగు కేంద్రాలలో ఈవీఎం మొరాయించడంతో కొంత సేపు పోలింగ్ జరగలేదు. కార్వేటినగరం అన్నూరు పోలింగ్ కేంద్రం వద్ద డిప్యూటీ సీఎం నారాయణస్వామి, గంగాధరనెల్లూరు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వీఎం థామస్ మధ్య మాటల యుద్ధం జరిగింది. థామస్ తనతోపాటు తమిళనాడు నుంచి బౌన్సలర్లను తీసుకొచ్చారని డిప్యూటీ సీఎం సహా వైసీపీ నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ బోడిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. పోలింగ్ కేంద్రంలో ఈవీఎం అరగంట సేపు మొరాయించింది. కేపీ అగ్రహారం పోలింగ్ కేంద్రం వద్ద ఇరువర్గాల ఘర్షణ జరగడంతో ఉద్రిక్తత నెలకొంది. కార్వేటినగరం మండలం డీఎంపురంలో ఈవీఎం అరగంట సేపు మొరాయించింది. ఎస్ఆర్‌పురం మండలం ముదికుప్పం, ఒడ్డుపల్లె పోలింగ్ కేంద్రాల వద్ద రచ్చ చోటుచేసుకుంది. పాలసముద్రం మండలం వనదుర్గాపురం పోలింగ్ కేంద్రంలో ఉభయ పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కాగా బొమ్మరాజపురం, రామలింగాపురం పోలింగ్ కేంద్రాల్లో గంట పాటు ఈవీఎంలు మొరాయించడంతో ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. పెనుమూరు మండలంలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి.

పాలసముద్రం : మండలంలోని బొమ్మరాజుపురం, రామలింగాపురం పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఓటువేయడానికి క్యూలైన్‌లో నిరీక్షించారు. టెక్నికల్ సిబ్బంది వచ్చి ఈవీఎంలను సరిచేసి ఓటింగ్ సజావుగా జరిగేటట్లు చర్యలు తీసుకున్నారు. దాదాపు గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. మండలంలో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది.

కార్వేటినగరం : కార్వేటినగరం మండలంలో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో మొత్తం 50 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొటారువీడులో ఉదయం 8 గంటలకే గ్రామీణ ప్రాంత ఓటర్లు పోలింగ్ కేంద్రానికి తరలి వచ్చారు.

శ్రీరంగరాజపురం : మండలంలోని 49కొత్తపల్లెమిట్ట పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించాయి. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు.

రాత్రి 10గంటల వరకు సాగిన పోలింగ్

గంగాధరనెల్లూరు : మండలంలోని కొత్తవెంకటాపురంలో రాత్రి 8.30గంటల వరకు, మహాదేవమంగళంలో రాత్రి 9.30గంటల వరకు, సిద్దేశ్వరకొండలో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. బాలగంగనపల్లెలోని పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా పోలీసులు చేరకుని వారిని తరిమి కొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. సిద్దేశ్వరకొండ పోలింగ్ కేంద్రంలో సైతం టీడీపీ, వైసీపీ నేతల మధ్య వివాదం చోటుచేసుకుంది.

ఓటర్లలో ఉరకలేసిన ఉత్సాహం..!

ఉదయం నుంచే పోటెత్తిన ఓటర్లు ● గంటల తరబడి ఎండల్లోనే ఓటర్లు ● చిత్తూరు అసెంబ్లీలో 74.75 శాతం పోలింగ్




చిత్తూరులోని బాలాజీ కాలనీ పాఠశాల, లక్ష్మీనగర్ కాలనీ బూత్‌లలో బారులు తీరిన ఓటర్లు

చిత్తూరు, సిటీ, సెంట్రల్, రూరల్, మే 13: ఓటర్లలో ఉత్సాహం ఉరకలేసింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు ఆసక్తి చూపారు. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమైనా, ఓటర్లు ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టారు. 11.30 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరినా, ఆపై ఎండ తీవ్రత నేపథ్యంలో మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పలుచగా కనిపించారు. అప్పటికే 60శాతం పోలింగ్ నమోదైనా సాయంత్రం 4 గంటల నుంచి పోలింగ్ శాతం పుంజుకుంది. సాయంత్రం 6 గంటలు పోలింగ్ ముగిసే సమయానికి క్యూలైన్‌లోని ఓటర్లకు అవకాశం కల్పించారు. పోలింగ్ ముగిసే సమయానికి చిత్తూరు అసెంబ్లీ పరిధిలో 74.75 శాతం పోలింగ్ నమోదైంది. తొలిసారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు యువత ఆసక్తి చూపారు. వృద్ధులు, దివ్యాంగులు సైతం ఓటును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. పోలింగ్ కేంద్రాల విభజన లేకపోవడంతో ఓటర్లు గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. క్యూలో నిల్చోలేక నీరసించిన పలువురికి అక్కడి వైద్యసిబ్బంది ఓఆర్ఎస్ నీటిని అందించారు. స్థానిక బ్రాహ్మణ వీధిలోని 57 పోలింగ్ కేంద్రంలో మాక్ పోలింగ్ సజావుగా నిర్వహించినా, ఆపై ఈవీఎంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో 7గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ 8.30గంటలకు ప్రారంభమయ్యింది. జెడ్పీ కార్యాలయంలోని గత ఎన్నికల్లో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఈ సారి మాత్రం ఒక్కటే ఏర్పాటు చేయడంతో ఓటర్లు గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా ఇదే కేంద్రంలో ఈవీఎంలు గంట సేపు మొరాయించాయి. ఇదే ఘటనలు జిల్లా కేంద్రంలోని పలుచోట్ల చోటుచేసుకున్నాయి. చాలా పోలింగ్ కేంద్రాల్లో షామీయానాలు ఏర్పాటు చేయకపోవడంతో ఓటర్లు ఎండలోనే గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చున్నారు. చాలాచోట్ల ఓటర్లకు సరిపడా తాగునీటి వసతి ఏర్పాటు చేయలేదు. స్థానిక జానకారపల్లి, షర్మన్ స్కూల్, సంతపేట, దొడ్డిపల్లి, గిరింపేట, రాంనగర్ కాలనీలోని చైతన్య స్కూల్, గిరింపేటలోని మున్సిపల్ స్కూల్, విద్యుత్ నగర్‌లోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్లో ఉదయం నుంచి పోలింగ్ ముగిసే సమయం వరకు ఓటర్లు బారులు తీరారు. గిరింపేటలోని మున్సిపల్ స్కూల్, విద్యుత్ నగర్‌లోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్లో మూడేసి కేంద్రాలు ఏర్పాటు చేసినా, ఒకే గేటు ఉండటంతో ఓటర్ల అవస్థలు వర్ణణాతీతంగా మారాయి. ఇరువారంలోనూ ఒకే స్కూల్లో రెండు కేంద్రాల్లో ఏర్పాటు చేయడంతో ఇరుకుగా మారింది. దీంతో ఓటర్లు క్యూలైన్లో నిల్చోడానికి ఇబ్బందులు పడ్డారు. చాలా చోట్ల మహిళలు, పురుషులకు ప్రత్యేక క్యూలైన్‌లు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాజీనామా చేసిన వలంటీర్లు ఏజెంట్లుగా కూర్చోడాన్ని పలువురు అడ్డుకున్న క్రమంలో స్వల్ప వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. దీనిపై అధికారులు వివరణ ఇవ్వడంతో పలు పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితి సర్దుమణిగింది. పోలింగ్ కేంద్రాల ప్రాంగణాల్లో కనీసం ఫ్యాన్లు ఏర్పాటు చేయకపోవడంతో క్యూలోని ఓటర్లు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు.

చిత్తూరు రూరల్‌లో ఇలా...

చిత్తూరు రూరల్‌లో పోలింగ్ ప్రశాంత వాతావరణంలో సాగింది. మండలంలోని 17 పంచాయతీల్లోనూ ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ రాత్రి 7 గంటల వరకు కొనసాగింది. పోలింగ్ ముగిసే సమయానికి క్యూలైన్లోని ఓటర్లకు ఓటుహక్కును వినియోగించుకునేందుకు అధికారులు అవకాశం ఇచ్చారు. దీంతో 92 శాతం ఓట్లు పోలైయాయి. ప్రతి పంచా యతీలోనూ ఓటర్లు గంటల తరబడి క్యూలైన్లో వేచి ఉండి ఓటు హక్కును వినియోగించుకు న్నారు. బీఎన్ఆర్ పేటలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దంపతులు గీర్వాణి చంద్రప్రకాష్‌లు వారి ఓటుహక్కును వినియోగించుకున్నారు. చిత్తపాత పంచాయతీలో సుదీర్ఘంగా పోలింగ్ కొనసాగింది.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్వో



గుడిపాల గ్రామంలో పోలింగ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ, జేసీ

చిత్తూరు, గుడిపాల, చిత్తూరు రూరల్: చిత్తూరు నియోజకవర్గంలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంతమైన పోలింగ్ ప్రక్రియను ఆర్వో. జేసీ శ్రీనివాసులు, ఎస్పీ మణికంఠ చందోలు, ఏఆర్వోలు విజయలక్ష్మీ, శ్రీనివాసులురెడ్డి, డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డిలు గుడిపాల మండలంలోని పశుమంద, రామాపురం, మరకాలకుప్పం, మండికృష్ణాపురం, నంగమంగళం, గుడిపాల, తదితర పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అదేవిధంగా చిత్తూరు రూరల్ మండలంలో పలు కేంద్రాలను పరిశీలించి అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.అదేవిధంగా చిత్తూరు నగరంలో ప్రశాంత్‌నగర్, గిరింపేట, మిట్టూరు, వన్నియర్ బ్లాక్, ఖాదీ హైస్కూల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల విధివిధానాలపై అధికారులు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

పెరుమాళ్ల కండ్రిగలో రెచ్చిపోయిన అల్లరిమూకలు

చిత్తూరు, రూరల్ 13: చిత్తూరు రూరల్ మండలం పెరుమాళ్లకండ్రిగలో వైసీపీ అల్లరి మూకలు రెచ్చిపోయాయి. పోలింగ్ బూత్ వద్ద నగరానికి చెందిన వైసీపీ కార్యకర్త హల్‌చల్ చేశాడు. ఏజెంట్లు, గ్రామస్తులు ఎందుకు వచ్చావు అని ప్రశ్నించడంతో దురుసుగా ప్రవర్తించాడు. దీంతో గ్రామస్తులు మందలించి పంపించారు. దీంతో అతను నగరం నుంచి 20 మందితో వచ్చి గ్రామస్తులపై రాళ్ల దాడి చేశాడు. దీంతో గ్రామస్తులంతా ఏకమై అల్లరి మూకలను చెదరగొట్టారు. దీంతో వారు వాహనాలను కూడా వదిలి పారిపోయారు. గ్రామస్తులు పోలీసులకు పిర్యాదు చేశారు. అల్లరిమూకల దాడిలో గాయపడిన నలుగుర చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

పోలింగ్ బూత్ వద్ద వైసీపీ, టీడీపీ ఘర్షణ

గుడిపాల, మే 13: మండలంలోని మండికృష్ణాపురంలో ఉదయం పోలింగ్ ప్రారంభమైన కొద్ది గంటల్లోనే వైసీపీ నేతపై టీడీపీ నాయకుడు దాడి చేసి గాయపర్చిన ఘటన సోమవారం జరిగింది. ఈ గ్రామానికి చెందిన ఓ మహిళ ఓటు వేయడానికి బూత్‌లోకి వెళ్లగా ఆమెకు ఓటు వేయడం తెలియదని, ఆమె తరపున తాను వెళతానని టీడీపీ నేత చంద్ర వెళ్లాడు. టీడీపీ నాయకుడు చంద్ర వెళ్లడాన్ని వైసీపీకి చెందిన ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి సోదరుడు సురేష్, మరికొంత మంది అడ్డుకున్నారు. దాంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగ్గా చంద్ర అనే వ్యక్తిని వైసీపీ నేతలు బయటికి తోసుకుంటూ వచ్చారు. బయటకు వచ్చిన చంద్ర అనే వ్యక్తి సురేష్‌పై చాకుతో దాడి చేశాడు. వైసీపీ నేతలు టీడీపీకి చెందిన రవిపై కూడా దాడి చేశారు. ఈ దాడిలో సురేష్‌కు నడుం పైభాగంలో గాయమైంది. గాయపడిన సురేష్‌ను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గుడిపాల, 197 రామాపురం, పేయనపల్లె పోలింగ్ బూతుల్లో టీడీపీ, వైసీపీ మధ్య స్వల్ప ఘర్షణలు జరిగాయి. కొన్ని చోట్ల 7గంటలకు పోలింగ్‌ను ప్రారంభించాల్సి ఉండగా గంటల తరబడి ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. చిత్తపారలో రాత్రి 8 గంటల వరకు కూడా పోలింగ్ కొనసాగింది. రెండు పార్టీల అభ్యర్థులు గురజాల జగన్మోహన్ నాయుడు, విజయానందరెడ్డిలు పలు పోలింగ్ బూతులలో పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. గుడిపాలలో ఎస్ఐ ఏకపక్షంగా చేస్తున్నాడని, టీడీపీ, వైసీపీ ఓటర్ల మధ్య ఘర్షణ తీవ్రస్థాయికి చేరుకోవడంతో పరిశీలించారు.

పుల్లూరులో క్రికెట్ తెచ్చిన తంటా

దళితులపై అగ్రవర్ణాల దాడి

శ్రీరంగరాజపురం, మే 13: ఎస్ఆర్‌పురం మండలం పుల్లూరులో వారం రోజుల ముందు క్రికెట్ ఆటలో దళిత, అగ్రవర్ణాల యువకుల మధ్య గొడవలు చెలరేగాయి. సోమవారం రాత్రి పంచాయితీకి పిలిచి దాడి చేశారని గ్రామస్తులు వాపోయారు. అగ్రవర్ణాలకు చెందిన సుమారు 70 మంది యువకులు, గ్రామస్తులు ఎస్సీల ఇళ్లపై దాడి చేసి కిటికీల అద్దాలను, బైక్‌లను ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడడంతో గొడవ సద్దుమణిగింది.

నగరిలో పోలింగ్ 85.59 శాతం




సత్రవాడలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న భానుప్రకాష్, శ్రీహరిపురంలో ఇరువర్గాలు వాగ్వాదానికి దిగిన కార్యకర్తలు

నగరి, మే13: నగరి నియోజకవర్గ పరిధిలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నగరి మున్సిపాలిటీలోని చింతలపట్టెడలో బూత్ నెం.102లో ఉదయం 8.30 గంటల వరకు ఈవీఎం పనిచేయక పోవడంతో మరో ఈవీఎంను అధికారులు తీసుకొచ్చి 9గంటల పైన పోలింగు ప్రారంభించారు. నియోజక వర్గవ్యాప్తంగా మొత్తం 85.59 శాతం పోలింగు నమోదైంది. నగరి మున్సిపల్ కార్యాలయం వద్ద మంత్రి రోజా తన ఓటుహక్కును వినియోగించుకోగా టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ చంద్రగిరి నియోజకవర్గంలోని వెంకట్రామాపురంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి పుత్తూరులో తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. థెరణి, మేళపట్టు పోలింగ్‌బూత్‌లలో వృద్ధుల ఓట్లు వేసే విషయంలో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. నగరి దళితవాడలో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ జరగగా పోలీసులు చేరుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

విజయపురం : మండలంలో ఎన్నికలు సోమవారం ప్రశాంతగా ముగిశాయి. పన్నూరు, శ్రీహరిపురం, జీఎంపురం, ఎం.అగరంలో చెదురుముదురు ఘటనలు చోటు చేసుకోవడంతో పోలీసులు చెల్లాచెదరు చేశారు. కోసలనగరం, కొత్త ఇళత్తూరు పోలింగ్ కేంద్రాలలో ఈవీఎం ఉదయం రెండు గంటల పాటు మొరాయించాయి.

నింద్ర : మండలంలోని నింద్ర, అత్తూరు, అగరం పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సమయం ముగిసినా ఓటర్లు క్యూలో నిలబడి ఓట్లు వేశారు. శ్రీశైలం దేవస్థానం ట్రస్టు మాజీ చైర్మన్ చక్రపాణి రెడ్డి పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.

పూతలపట్టులో చెదురుమదురు ఘటనలు




జంబువారిపల్లె పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్‌లో వేచివున్న ఓటర్లు, ఎగువమారేడుపల్లెలో ఓటు వేయడానికి తరలి వచ్చిన మహిళలు

పూతలపట్టు, మే 13: పూతలపట్టు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద సోమవారం చెదురుముదురు ఘటనలు జరిగాయి. పాపానాయుడుపలి, పేటపల్లి, ఎర్రచెరువుపల్లి, పోటుకనుమ, అయ్యప్పగారిపల్లి, పేటఅగ్రహారం, వేపనపల్లి పోలింగ్ బూత్‌ల్లో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఎస్పీ మణికంఠ చందోలు పేటఅగ్రహారం పోలింగ్ కేంద్రానికి చేరుకుని పరిస్థితులను పర్యవేక్షించారు. అలాగే పి. కొత్తకోట పంచాయతీ సంజీవరాయనిపల్లి పోలింగ్ బూత్‌లో ఓ వైసీపీ నేత ఓటర్ల దగ్గర నుండి స్లిప్పులు బలవంతంగా లాక్కొని అతను ఒక్కడే 36 ఓట్లు వేశాడు. సమాచారం అందుకున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్, స్థానిక నేత బాబురావు, పలువురు కార్యకర్తలు అధికసంఖ్యలో అక్కడికి చేరుకుని పీవో వద్ద విషయాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. పోలవరం పోలింగ్ బూత్‌లో ఉదయం మాక్ పోలింగ్ సమయంలో బటన్ నొక్కితే అన్నీ ఓట్లు వైసీపీకి వెళ్తున్నాయని గమనించిన పీవో పోలింగ్‌ను కొంతసేపు ఆపి, ఉన్నతస్థాయి అధికారులకు సమాచారం అందించి, ఈవీఎంలను మరమ్మతులు చేసి పోలింగ్‌ను ప్రారంభించారు.



చుక్కావారిపల్లెలో ఓటు వేయడానికి వేచి ఉన్న ఓటర్లు

తవణంపల్లె : మండలంలోని దిగువతడకరలో ఈవీఎం మొరాయించి పోలింగ్ ఆలస్యం కావడంతో పోలింగ్ బూత్‌లకు చేరుకొన్న ఓటర్లుకు టోకన్లు పంపిణీ చేసి సాయంత్రం 7 గంటల వరకు పోలింగ్ కొనసాగించారు. ఎన్నికల పోలింగ్ ముగిసే సమయానికి 87 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొన్నట్లు ఏఆర్వో తెలిపారు.

బంగారుపాళ్యం : మహాసముద్రం పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో పోలింగ్‌కు గంట ఆలస్యమైంది. నలగాంపల్లి, టేకుమంద, దిగువ రాగిమానిపెంట పోలింగ్ కేంద్రాల్లో చిన్నపాటి సాంకేతిక లోపం వల్ల పోలింగ్ ప్రక్రియకు కొంతమేర అంతరాయం ఏర్పడింది.

ఐరాల : మండలంలోని ఎర్రేపల్లె పోలింగ్ కేంద్రంలో మధ్యాహ్నం టీడీపీ ఏజెంట్‌ను పోలింగ్ కేంద్రం నుంచి బయటకు పంపి వేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. సాయంత్రం ఐరాలలో అల్లరి మూకలు పోలింగ్ కేంద్రం వెలుపల చిన్నపాటి ఘర్షణకు దిగారు. పుత్రమద్దిలో ఈవీఎం యంత్రం మొరాయించడంతో అర్ధగంట సమయం వరకు పోలింగ్‌కు అలస్యమైయింది. కాణిపాకంలో రాత్రి ఏడు గంటల వరకు పోలింగ్ నిర్వహించారు.

డిప్యూటీ సీఎంను ఉతికి ఆరేస్తా : థామస్

వెదురుకుప్పం, మే13: లిక్కర్ స్కాంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామిని ఉతికి ఆరేస్తానని గంగాధరనెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వీఎం థామస్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దొంగల్ని ఉతికి ఆరేయడానికే గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో పోటీ చేశానని చెప్పారు. ఈ నియోజకవర్గంలో ఓటర్లు చూపిన ఆదరఅభిమానం మరిచిపోలేనిదని, న్యాయం కోసం, ప్రజల కోసం పోరాడుతానని చెప్పారు.

సహకార సంఘం సీఈవోపై ఫిర్యాదు

వెదురుకుప్పం, మే 13: కార్వేటినగరం సహకార సంఘం సీఈవో దుష్యంత్ ఓటర్లను ప్రలోభ పెట్టడానికి పాల్పడ్డారని సోమవారం జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లినట్లు ఆర్కేవీబీపేట గ్రామస్తులు తెలిపారు. కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేటకు చెందిన దుష్యంత్ కార్వేటినగరం పీఏసీఎస్ సీఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి వ్యవహరించారని తెలిపారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి తమ గ్రామానికి వస్తే కూడా హాజరయ్యారని తెలిపారు.

శతాధిక వృద్ధుడు ఓటేశారు



వెదురుకుప్పం, మే 13: శతాధిక వృద్ధుడు, మాజీ ప్రజాప్రతినిధి ఒకరు సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తన ఓటేశారు. వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ బండి నరసింహారెడ్డి(102) సోమవారం పెరుమాళ్లపల్లె పోలింగ్‌కేంద్రంలో ఓటు వినియోగించుకున్నారు.

మద్యం పట్టివేత

పాలసముద్రం, మే13: పాలసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణజిమ్మాపురం వద్ద ఆదివారం రాత్రి తమిళనాడు నుంచి టిప్పర్ ద్వారా మద్యం తీసుకొస్తుండగా కృష్ణజిమ్మాపురం వద్ద ఎస్ఐ భారతి తన సిబ్బందితో దాడి చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మద్యం సీసాలతో ఉన్న టిప్పర్‌ను సీజ్ చేసి, మద్యాన్ని పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. ఎన్నికల విధుల్లో పోలీసులు ఉండడం వల్ల మద్యం బాటిళ్ళు లెక్కగట్టి, వాటిని విలువకట్టి కేసు నమోదు చేస్తామని ఆమె తెలిపారు.



జీడీ నెల్లూరులో టీడీపీదే గెలుపు

- భీమనేని చిట్టిబాబు నాయుడు

పాలసముద్రం, మే 13: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్ అత్యధిక మెజార్టీతో గెలుపొందుతారని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఓటర్లు తెలుగు దేశం పార్టీకి మొగ్గుచూపార్కన్నారు. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి టీడీపీకే ఓటు వేశారని, పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు తెలుసుకుని, సమీక్షించామని, డాక్టర్ థామస్ గెలుపు తథ్యమన్నారు.



చిత్తూరులో టీడీపీ అభ్యర్థి గురజాల దంపతులు, వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి, నగరిలో మంత్రి రోజా, వెంకట్రామాపురంలో భానుప్రకాష్ -గంగాధరనెల్లూరు టీడీపీ అభ్యర్థి థామస్, కాంగ్రెస్ అభ్యర్థి రమేష్‌బాబు, వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మి, పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్